క్లుప్తంగా

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సోమవారం అయోధ్య రాముడి అక్షింతలు, కరపత్రాలు పంపిణీ చేశారు. 52వ వార్డు గణేష్ నగర్, గౌరీ నగర్ ప్రాంతాల్లో రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సంఘ్ పరివార్‌కు సంబంధించిన రాష్ట్రీయ స్వయం సేవక్, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన స్వయం సేవకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అయోధ్య రాముని స్పర్శ అక్షింతలను, కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అయోధ్య అక్షింతలు అందరికీ అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ అన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షురాలు చల్లా మంజుల, రాష్ట్ర సభ్యత్వ ప్రముఖ్ జీసీ నాయుడు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ డైరీ ఆవిష్కరణ



పాకెట్ డైరీని ఆవిష్కరించిన పి.ఎస్.ఆర్.మూర్తి

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు సింధియా న్యూకాలనీలోని యూనియన్ భవనంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కె.ఎం.జి.గణేష్ అధ్యక్షతన ఐఎన్‌టీయూసీ పాకెట్ డైరీని షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఆర్.మూర్తి చేతుల మీదుగా ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పోర్టు చైర్మన్ అంగముత్తుతో యూనియన్ సభ్యులు

కంచరపాలెం: పోర్ట్ చైర్మన్ అంగముత్తును నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, యూనియన్ సభ్యులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రావ్, వైస్ ప్రెసిడెంట్ పీవీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అప్పలనాయుడు, సెక్రటరీ శశి, సభ్యులు ఎస్‌కే రాజు, రవి, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్



ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: ఉద్యోగుల సమష్టి కృషితో స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్ సాధ్యమని సీఎండీ అతుల్ భట్ ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం ఉక్కు మల్టీపర్పస్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సంక్షోభం నుంచి బయటపడేందుకు ఉద్యోగులు, కార్మిక సంఘాలతో పాటు ఇతర వ్యాపార సహచరులు మద్దతు ఇవ్వాలని కోరారు. టర్న్ అరౌండ్ ప్లాన్ పంచుకుంటూ సాంకేతిక అడ్డంకులు, ఆర్థిక సమస్యలు, వర్కింగ్ క్యాపిటల్ సమస్యలు, రుణ తగ్గింపు వ్యూహాలు, ముడి సరుకుల అనుసంధానాన్ని నిర్ధారించడం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ డైరెక్టర్లతో ఇంటర్నల్ సంచిక ఉక్కు వాణి, ఫీల్డ్ బుక్, వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్లాంట్ మార్కెటింగ్, ఉత్పత్తి వివరాలు వెల్లడించారు.

ప్రగతి కాంతులు

- సర్వాంగ సుందరంగా వీధులు
- రూ.2.53 కోట్లతో అభివృద్ధి పనులు
- రహదారులు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం
- బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్‌ఈబీ, లక్ష్మీనగర్ కాలనీల అనుసంధానం



విశాఖ విద్య: ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేస్తోంది. విశాఖ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఆ నిధులతో అభివృద్ధి కాంతులు కనిపిస్తున్నాయి. జీవీఎంసీ 90వ వార్డులో ఏకంగా రూ.2.53 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ ఏపీఎంఎస్ ఎంఈడీసీ చైర్మన్ కావడంతో వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించేలా ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారు.

భవిష్యత్ అవసరాల మేరకు..

ఎన్ఏడీ సెంటర్‌కు ఓ వైపున ఉన్న 90వ వార్డులోని బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్‌ఈబీ, లక్ష్మీనగర్-ఎఫ్ బ్లాక్ కాలనీలు కలిసే ఉంటాయి. వుడా అనుమతులతో ఏర్పాటైన ఏపీఎస్‌ఈబీ కాలనీ విశాలమైన రహదారులు, గ్రీనరీతో ప్రశాంత వాతావరణం ఉంటుంది. లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో రోజు వారీ పనులకు వెళ్లే వివిధ వర్గాలకు చెందిన వారు ఉంటున్నారు. ఇలా క్లాస్, మాస్ మిళితమై ఉన్న ఈ మూడుకాలనీలను అనుసంధానం చేస్తూ రహదారులు, డ్రైనేజీల అభివృద్ధికి జీవీఎంసీ అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. కాలనీలకు ఎగువన ఉన్న కొండవాలు ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు నిల్వ ఉండకుండా దిగువకు పోయేలా డ్రైనేజీ, కాలువలను పటిష్టం చేశారు.

ఆహ్లాదకర వాతావరణం

బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్‌ఈబీ కాలనీ, లక్ష్మీనగర్-ఎఫ్ బ్లాక్ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి తీసుకొచ్చేలా పార్కులు అభివృద్ధి చేశారు. సీతారామరాజు పార్కు ఆధునికీకరణకు సుమారు రూ.32 లక్షలు వెచ్చించారు. సర్వాంగ సుందరంగా ఉండడంతో మూడు కాలనీలకు చెందిన ప్రజానీకం ఉదయం,సాయంత్రం వేళల్లో పార్కుకు క్యూ కడుతున్నారు. పంచతత్వ పార్కును ఆయుర్వేద వనంగా తీర్చిదిద్దారు.



కాలనీలకు అందుబాటులో సచివాలయాలు



లక్ష్మీనగర్ ఎఫ్- బ్లాక్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీలు

మూడు కాలనీల్లో చేపట్టిన పనులకు ఖర్చు చేసిన నిధులు

- ఎన్ఏడీ నుంచి పెందుర్తి వైపు - రూ.9.80 లక్షలు

బీఆర్‌టీఎస్ రోడ్డు మరమ్మతులకు

- ఎన్ఏడీ జంక్షన్ నుంచి గోపాలపట్నం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు సెంట్రల్ డివైడర్స్ పెయింటింగ్, ఫుట్‌పాత్‌ల సుందరీకరణ:- రూ.18 లక్షలు
- లక్ష్మీ నగర్ -ఎఫ్ బ్లాక్‌లో సీసీ రోడ్స్, డ్రైన్స్, మెట్ల నిర్మాణం:-రూ.6.35 లక్షలు
- ఎన్ఎస్‌టీఎల్ గేటు నుంచి ఎన్‌హెచ్-16 వరకు పరిశుభ్రత, ఖాళీ స్థలంలో మొక్కల పెంపకం:- రూ.15.35 లక్షలు
- వంశీ సూపర్ మార్కెట్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు పునర్నిర్మాణం:- రూ.19.50 లక్షలు
- ఏపీఎస్‌ఈబీ కాలనీ రమ్య బేకరీ నుంచి ఆర్చి వరకు రోడ్డు పునర్నిర్మాణం:-రూ.19.97 లక్షలు
- తహసీల్దార్ కార్యాలయం నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డుకు అంతర్గత రహదారి నిర్మాణం: రూ.14.90 లక్షలు
- సెయింట్ ఆన్స్ స్కూల్ నుంచి చెఫ్‌హోటల్ వరకు రోడ్డు నిర్మాణం : రూ.15 లక్షలు
- ఎన్ఏడీ నుంచి పెందుర్తి రోడ్డులో మరమ్మతులు :- రూ.9.62 లక్షలు
- వంటిల్లు నుంచి మారిట్ హోటల్ వరకు కాంపౌండ్ బ్యూటిఫికేషన్ :- రూ.4.50 లక్షలు
- ఏపీఎస్‌ఈబీ కాలనీ సీతారామరాజు పార్కులో షెడ్డు, పార్కు మరమ్మతులు : రూ.12.70 లక్షలు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద సీసీ డ్రైన్ల నిర్మాణం: రూ.5 లక్షలు
- వంశీ సూపర్‌మార్కెట్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు డ్రైన్ల నిర్మాణం: రూ.15 లక్షలు
- బుచ్చిరాజుపాలెం అర్బన్ హెల్త్ సెంటర్ భవనం మరమ్మతులు : రూ.9 లక్షలు



సీతారామరాజుపార్కులో ఆడుకుంటున్న చిన్నారులు



తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్మించిన బీటీ రోడ్డు

- బుచ్చిరాజుపాలెంలోని డిస్పెన్సరీ మరమ్మతులు : రూ.7 లక్షలు
- ఏపీఎస్‌ఈబీ కాలనీలో శివాలయం నుంచి జీవీఎంసీ పార్కు వరకు బీటీ రోడ్డు రూ.19.50 లక్షలు
- ఏపీఎస్‌ఈబీకాలనీలోని డ్రైన్ల నిర్మాణం : రూ.35 లక్షలు
- లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో డ్రైన్ల నిర్మాణం :రూ.17.20 లక్షలు

ప్రజావసరాలకు ప్రాధాన్యం



బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్‌ఈబీ కాలనీ, లక్ష్మీనగర్ -ఎఫ్ బ్లాక్‌లు మూడు కూడా కలిసే ఉంటాయి. అందుకే ఆ కాలనీలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ కాలనీల అభివృద్ధిపై శ్రద్ధ తీసుకుంటున్నారు. విశాఖ డెయిరీ నుంచి సైతం నిధులు తీసుకొచ్చి ప్రజావసరాల తీర్చేలా పనులు చేస్తున్నారు.

– నమ్మి శ్రీను, వార్డు నాయకుడు

సౌకర్యాలు మెరుగుపడ్డాయి



మా కాలనీలో మౌలిక సౌకర్యాలు మెరుగుపడ్డాయి. అవసరమైన చోట డ్రైనేజీ, కాలువలు నిర్మాణం చేపడుతున్నారు. ఆడారి ఆనంద్ కుమార్, నమ్మి శ్రీను మా కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కాలనీలో ఉన్న పాఠశాలను కూడా నాడు-నేడు కింద అభివృద్ధి చేస్తున్నారు.

– ఎం.సత్యవతి, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్

పార్కుల అభివృద్ధితో మేలు



పార్కులను అభివృద్ధి చేయటం వల్ల అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంది. రాజకీయాలతో సంబంధం లేకుండా అన్నివర్గాలను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి పనులు చేయడం మంచి పరిణామం. గతంలో కన్నా ఇప్పుడు కాలనీలో రహదారులు కూడా మెరుగుపడ్డాయి.

– విల్లా సత్యనారాయణ రావు, ఏపీఎస్‌ఈబీ కాలనీ

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

గోపాలపట్నం/మల్కాపురం: నూతన సంవత్సర వేడుకలను నియోజకవర్గ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆత్మీయత, అనురాగాలు పంచుకున్నారు.వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఆయన్ను క్యాంపు కార్యాలయంలో అధికారులు, నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కర రావు , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ , వార్డు కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, గుండపు నాగేశ్వరరావు,బల్లా లక్ష్మణరావు,కొణతాల సుధతో పాటు ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్‌లో క్యాంపు కార్యాలయంలో శ్రీధర్‌ను పార్టీ నాయకులు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



ఆనంద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు



ఆనంద్ కుమార్‌ను శుభాకాంక్షలు తెలుపుతున్న బెహరా భాస్కరరావు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



శ్రీధర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఉద్యోగులు

కొత్త శోభ

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. 2023కు వీడ్కోలు పలికి, 2024 సంవత్సరానికి అన్ని వర్గాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి వరకు మేల్కొని 12గంటల తర్వాత హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఒకొరికొకరు ఆనందాన్ని పంచుకున్నారు. న్యూ ఇయర్ కేక్ కట్ చేసి, అందరికీ మిఠాయిలు పంచారు. నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సోమవారం ఎన్ఏడీ సెంటర్‌లోని ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



పుష్పాలంకరణలో బాబా

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు

బుచ్చిరాజుపాలెం షిర్డీ సాయి ధ్యానమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో బాబాను ప్రత్యేక అలంకరించారు. సాయి కీర్తనలు ఆలపించి సాయిబాబా వారికి కర్పూర హారతి ఇచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణరావు భక్తులతో కలసి బాబా విగ్రహం ముందు భారీ కేక్ కట్ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కొత్త సీజీఎంకు అభినందన



నూతన సీజీఎం సోఫ్తీకి అభినందనలు తెలుపుతున్న సిటూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ విభాగం నూతన సీజీఎం ఎ.కె. సోఫ్తీకి స్టీల్ సీఐటీయూ నాయకులు అభినందనలు తెలిపారు. సీజీఎం వర్క్స్‌గా విధు లు నిర్వహించిన ఎన్.వి.స్వామి ఆదివారం పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో సోఫ్తీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు అయోధ్య రామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా 19వ రోజు సోమవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్ర నామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన జరిపారు.

పింఛన్ల పంపిణీకి వేళాయె

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల 24 వార్డులకు సంబంధించి లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు సోమవారం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులతోపాటు కొత్త లబ్ధిదారులకు మంగళవారం నుంచి పింఛన్లు అందజేస్తారన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ డబ్బులు పంపిణీ చేస్తారని చెప్పారు.

పాత పెన్షన్లు– 27,461.. కొత్తవి– 346

జోన్-5కు సంబంధించి పాత పెన్షనర్లు 27,461 మందితోపాటు కొత్తగా 346 మందికి పింఛన్లు మంజూరైనట్లు యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. జోన్-5 పరిధిలోని కొన్ని వార్డుల్లో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆయా వార్డుల్లో నియోజకవర్గ, వార్డు నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తల సమక్షంలో పింఛన్లు పంపిణీ జరుగుతుందని, వారంలో 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్-5 ఏపీడీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు.



జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

గాజువాక: ఈ నెల 3 నుంచి 6 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు గాజువాక ప్రాంతానికి చెందిన 20 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వారు సోమవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు అభినందించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 150 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని, వారిలో 20 మంది గాజువాకకు చెందినవారు ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రతినిధులు ప్రేమ్ కుమార్, వెంకట్, ఆనంద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో 'ఉక్కు' పరిరక్షణ



1054వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా విజయం సాధించగలమని నాయకులు పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1054వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేందుకు ఉక్కు కార్మిక వర్గం ప్రజలను చైతన్య పరిచి ఉద్యమం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు





నూతన సంవత్సర ప్రార్థనల్లో సంఘ కాపరి, పాల్గొన్న సంఘ సభ్యులు

గోపాలపట్నం: దేవుడు పీడితుల చెంతనే ఉంటాడని సంఘ కాపరి ఏంజిల్ బ్లెస్సీ అన్నారు. జీవీఎంసీ 91వ వార్డు జయప్రకాష్ నగర్ ఎరుసలేమ్ ప్రార్థన మందిరంలో నూతన సంవత్సర వేడుకలతో పాటు 40వ వార్షికోత్సవం(రూబీ) నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ చర్చితో తనకు చిన్ననాటి నుంచి అనుబంధం ఉందన్నారు.

గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రి పునఃప్రారంభం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డులోని గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రిని హిందూస్తాన్ షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి సోమవారం ప్రారంభించారు. ఇక్కడ పశువుల ఆస్పత్రి ఉన్న స్థలం షిప్‌యార్డు పరిధిలో ఉండడంతో ఆధునికీకరణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు సిఫార్సుతో పశువుల ఆస్పత్రి డాక్టర్ సునీల్‌కుమార్ మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన షిప్‌యార్డ్ యాజమాన్యం సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రి మరమ్మతులు చేయించారు. దీంతో సోమవారం ఆస్పత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో జేపీ గుప్తా, ఎంవీఎస్ గుప్తా. డైరెక్టర్ శ్రీనివాసరావు, రమణ, డాక్టర్ సునీల్, గ్రంథాలయ ఇన్‌చార్జి కనకరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పశువుల ఆస్పత్రిని పునఃప్రారంభిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

వేడుకగా దుర్గాదేవి అంబలం పూజ

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో దుర్గామల్లేశ్వరి పీఠాధిపతి, గురుభవానీ సూర్యనారాయణ మిత్ర బృందం ఆధ్వర్యంలో వారాహి మాత అవతారంలో దుర్గాదేవి అమ్మవారి అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహాయ సహకారాలు అందించారు.

వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠంలోని సభ్యులు నాగేశ్వరరావును సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతంతో పాటు గాజువాక ప్రాంత భవానీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కార్పొరేటర్ నాగేశ్వరరావును సత్కరిస్తున్న భవానీలు

శ్రీవారి ఆలయంలో పుష్పయాగం

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీ మామిడి తోటలో కొలువుదీరిన పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేస్వార స్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగం చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పుష్పయాగం చేశారు. కోలాటం, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శ్రీసాయి నాట్య భారతి అకాడమీ ప్రతినిధి శిరీషారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద సంఖ్యలో భక్తులు ఈ యాగంలో పాల్గొన్నారు.



పుష్పరాశి నడుమ శ్రీనివాసుడు